క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



నాగర్‌కర్నూల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు వర్క్ రాష్ట్ర స్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తాన తెలిపారు. కళాశాలలో గణిత శాస్త్ర విభాగాధిపతి ఎం.అంజయ్య పర్యవేక్షణలో విద్యార్థులు ప్రత్యూష, సునీత, శిరీష, సరస్వతి, అనిల్, అనిల్ కుమార్ అప్లికేషన్ ఆఫ్ ఐ గన్ వాల్యూస్ అనే అంశంపై ప్రాజెక్టు వర్క్ చేశారని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో దీనిని ప్రదర్శించడంతో అధికారులు అభినందించి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల పరిశీలన

ఊర్కొండ: మండలంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పనులను కల్వకుర్తి డీఎల్‌పీఓ పండరినాథ్ గురువారం ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే విధానం, ట్రాక్టర్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకెళ్లుట గురించి, మురుగు పారుదల గురించి పారిశుద్ధ్యం అమలు జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో గురువారం గీతా కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గీతా కార్మికులకు రూ.5 లక్షల బీమా అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో గీతా కార్మికులు పాలాభిషేకం చేశారు. సురేష్‌గౌడ్, చంద్రయ్య గౌడ్, కృష్ణయ్య గౌడ్, సత్తయ్య గౌడ్, తిరుపతయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు



అచ్చంపేట: పద్మశాలి సంఘం ఎన్నికల కోసం రాష్ట్ర అధ్యక్షుడు రామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట పట్టణంలోని సంఘం కమ్యూనిటీ హాలులో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. గురువారం ఒక్కరోజులోనే 300 సభ్యత్వాలు తీసుకున్నట్లు నాయకులు తెలియజేశారు. యాదగిరి, కోటకిశోర్, రమేష్, శకుంతల, పర్వతాలు, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కల్వకుర్తి రూరల్: రైస్ మిల్లులకు వచ్చే ధాన్యంలో తాలు, తేమ పేరుతో తూకం తగ్గించి ఇబ్బందులు పెడుతున్నారని, ఆ ఇబ్బందులు లేకుండా చూడాలని నియోజకవర్గ రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్ బాబుకు వినతి అందజేశారు. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించి రైస్ మిల్లులకు తరలించిన తరువాత బియ్యం శాతం సరిగ్గా రావడం లేదని, తూకం తగ్గిస్తున్నారని ఇది రైతులకు ఇబ్బంది కలిగిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, పాండు గౌడ్, అశోక్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

బల్మూర్: ప్రభుత్వం పేదల కళ్లలో చక్కటి వెలుగునివ్వడం కోసం ప్రజలకు చేరువలో ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వేనేపల్లి అరుణ సూచించారు. మండలంలోని మైలారంలో గురువారం ఆమె అధికారులు, సర్పంచ్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ చూపుతూ.. వారికి కావాల్సిన వైద్యం ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లికంటి శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.తారాసింగ్, ఎంపీడీఓ దేవన్న, డాక్టర్ ప్రశాంతి, సూపర్‌వైజర్లు శాంతాబాయి, అంజనమ్మ, సీతమ్మ, బాలీశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణం

తాడూరు: మండలంలోని శిర్సవాడలో లక్ష్మీనారసింహస్వామి కల్యాణం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుదర్శనహోమం, సామూహిక గీతాయజ్ఞం, మంగళహారతి వంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణానికి గ్రామస్తులతో పాటు వివిధ మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి పూజలు..

లక్ష్మీనారసింహ కల్యాణంలో ఎమ్మెల్యే మర్రిజనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, రాములు, గోపిరెడ్డి, రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లో శ్రీలక్ష్మీ నారసింహస్వామి దేవాలయంలో గురువారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో బ్రహ్మోత్సవంలో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతి ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడు, శేఖర్, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో మంగళసూత్రాన్ని భక్తులలకు చూపిస్తున్న పూజారి

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లిలో శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఆలయంలో చేపట్టిన ధ్వజస్తంభ పత్రిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమహాలక్ష్మీ, అండాళ్ అమ్మవారు, ఆంజనేయస్వామి, గరుత్మంత విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.



ఆలయంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



బైరాపూర్‌లో పట్టువస్త్రాలు అందజేస్తున్న వంశీచంద్



కల్యాణంలో పాల్గొన్న మహిళలు

'నీళ్లు, నియామకాలు ఏమయ్యాయి'?

బల్మూర్: నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో లక్ష్యాలు నెరవేరడం లేదని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ విమర్శించారు. మండలంలోని అనంతవరం, అంబగిరి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర నిర్వహించారు. యాత్రలో ఆయన పాల్గొని గడప గడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్, పార్టీ విధి విధానాలు కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. కేవలం కుటుంబ పాలనతో మాయమాటలతో గారడి పాలన సాగిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమ భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, స్కాంలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు, మూడు ఎకరాల భూ పంపిణీ, ఇంటికో కొలువు వాగ్దానాలు పత్తా లేకుండా పోయాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పారు. మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, నర్సింగరావు, బిల్‌నాయక్, చందునాయక్, అంజినాయక్, సేవ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



అంబగిరిలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

నిరసన సభను విజయవంతం చేయండి

అచ్చంపేట: హైదరాబాద్‌లో ఈ నెల 8న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన సభను నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ తెలియజేశారు. గురువారం అచ్చంపేట ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. లక్షల మంది నిరుద్యోగులకు మద్దతుగా ఈ సభ ఉంటుందని, ఈ బహిరంగ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు. ఎల్బీనగర్‌లో శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి, సరూర్‌నగర్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, నిరుద్యోగ యువకులు, విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. గోపాల్‌రెడ్డి, నరసయ్య యాదవ్, వెంకట్‌రెడ్డి, రామనాథం, శ్రీనివాసులు, బుచ్చిరాములు, రాజగోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలను బుధవారం నుంచి ప్రారంభించారు. శుక్రవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్న సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుణ్యస్నానవచనం, హోమం, పుష్పాలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించి పలు జంటలు హోమంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సుదర్శనాచారి, ఎంపీటీసీ సుమలత, శేషాంద్రప్రసాద్, సత్యనారాయణ, శివశంకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

బదిలీపై వెళ్లిన మెజిస్ట్రేట్‌కు సన్మానం



న్యాయవాదులతో మెజిస్ట్రేట్ వెంకటరమణ

కొల్లాపూర్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్‌కే. వెంకటరమణ సుహాస్ ఇటీవల మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయనకు గురువారం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. అదనపు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావాన్ని, ఉద్యోగులపై చూపించే ఆప్యాయతను వారు కొనియాడారు.

ప్రతిధాన్యం గింజను కొనుగోలు చేయాలి



తెలకపల్లిలో వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తెలకపల్లి: ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. గురువారం మండల కేంద్రం మార్కెట్ యార్డును వారు సోమవారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. తెలకపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పండించిన వరి ధాన్యాన్ని పరిశీలించి అనంతరం వారు మాట్లాడారు. తెలకపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబెట్టినా.. తేమ ఎక్కువగా ఉందనే నెపంతో కొనుగోళ్లు చేపట్టలేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ గ్రేడ్ రకం 18 శాతం తేమ ఉన్నా.. కొనుగోలు చేయాలని, అయినా నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. వర్షాలు తక్కువ అయినందున కోతలు ప్రారంభమయ్యాయని జిల్లాలో పీఏసీఎస్ సివిల్ సప్లయ్ ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపస్ లక్ష్మణ్, కుర్మయ్య, ఈశ్వర్, జగదీశ్, పార్వతమ్మ ఉన్నారు.

కంటోనిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లిలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో రైతులు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.5 లక్షల విలువతో నూతనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారు. శ్రీను, అంజయ్య, తేజు, ప్రవీణ్, పుల్లయ్య, మురళి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మేడే ఉత్సవాలు



కల్వకుర్తి రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని యూటీఎస్ భవనంలో గురువారం విద్యార్థులతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, చిన్నయ్య, మల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య పరిరక్షణ

బల్మూర్: ప్రకృతి వ్యవసాయ సాగు తక్కువ ఖర్చుతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి మహేష్‌కుమార్ సూచించారు. మండలంలోని చెంచుగూడెంలో ఐటీడీఏ, చైల్డ్ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం చెంచు రైతులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో 52 మంది రైతులను గుర్తించి ఎంపిక చేశారు. వారికి పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం యొక్క అవసరం, దాని ప్రాముఖ్యత, నేల స్వభావం, పరిరక్షణపై శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు బయటి నుంచి ఎటువంటి ఎరువులు, విత్తనాలు, పెట్టుబడి వస్తువులు కొనకుండా తమ వద్దే లభించే దేశీయ విత్తనాలను వాడుకోవాలని, పశువుల పేడ, మూత్రం, వావిలాకు, వేప, కానుగ, జిల్లెడు, సీతాఫలం, వంటి ఆకులు సేకరించి ఎరువులు, పురుగు మందు తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శివకృష్ణ, రత్నారావు, ఐసీఆర్ నిమ్మల చిన్నయ్య, బుచ్చిరాజు, రైతులు పాల్గొన్నారు.



'రైతులు అధైర్యపడొద్దు'

కొల్లాపూర్ రూరల్: రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నార్లాపూర్, ముక్కిడిగుండం గ్రామాల్లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నారన్నారు. కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో రైతులకు రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంట్ ఇస్తుందన్నారు. రాష్ట్రంలో గ్రామాల స్వరూపాలు మారి, అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కొల్లాపూర్ ప్రాంతానికి తాగునీటి సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం రూ.కోట్లు మంజూరు చేసిందని, పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ కూడా త్వరలో ప్రారంభం కాబోతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోడేరు: మండలంలోని రేకులపల్లి తండా నూతన గ్రామపంచాయతీ పరిధిలో ఒప్పి తండాలో వరి కొనుగోలు కేంద్రాన్ని కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, సీఈఓ ప్రకాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ శివుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రాంత రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీరం



ఒప్పితండాలో ప్రారంభిస్తున్న కిషన్‌నాయక్

కంప్యూటర్ పై పరిజ్ఞానం పెంచుకోవాలి

తాడూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత కంప్యూటర్‌పై సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అంతారం సర్పంచ్ జయమ్మ అన్నారు. గ్రామంలో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేపాల్ ప్రాజెక్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామం డిజిటల్ విలేజ్‌లో ఎంపికవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. దీంతో యువతీ, యువకులతో పాటు పెద్దలకు కంప్యూటర్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ నూతనంగా ప్రారంభించిన మినీ కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. త్వరలోనే ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిజిటల్ విలేజ్ ప్రొడక్ట్ క్యాలండర్‌ను ప్రభుత్వ అనుమతితో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్, మాజీ సర్పంచ్ చిన్నరాములు, గ్రామస్తులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌లో నిమగ్నమైన విద్యార్థులు

ప్రజాప్రతినిధులకు విన్నవించిన జేపీఎస్‌లు



ఎంపీ రాములుకు వినతి అందజేస్తున్న కార్యదర్శులు



తెలకపల్లిలో నిరసన

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ రూరల్: నియోజకవర్గానికి చెందిన ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు.

రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యేకు వినతి

తెలకపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి వినతి అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి ఆరో రోజుకు చేరుకుంది.

ఎంపీ, ఎమ్మెల్యేలకు..

కల్వకుర్తి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డివిజన్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గురువారం నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వినతి అందజేశారు.

కల్వకుర్తిరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచందర్ రెడ్డి గురువారం సంఘీభావం తెలిపారు.



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు



కల్వకుర్తిలో...

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

తెలకపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 18వ రోజుకు చేరుకుంది. ఉద్యోగ భద్రత కల్పించాలని అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన వరిపంట

కోడేరు: మండలంలో ఈదురుగాలులు, అకాల వర్షాలకు పంటలు నేలకొరిగాయి. మండలంలోని బాడిగదిన్నెకి చెందిన రైతు బాలపీరు 4 ఎకరాల వరి పంటను సాగు చేశాడు. రాత్రి వీచిన ఈదురు గాలులకు చేతికి వచ్చిన పంట నేలపై వాలిపోయింది. వడ్లు కూడా రాలిపోయాయని బాధితుడు వాపోయాడు. ఈదురు గాలులు, అకాల వర్షానికి దాదాపు రూ.1.97లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు

ఆక్రమణకు గురవుతున్న బస్‌షెల్టర్

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కొల్లాపూర్ రోడ్డుపై ఉన్న బస్‌షెల్టర్‌ను ఆక్రమించుకుంటున్నారు. వర్షం, ఎండ నుంచి ప్రయాణికులను రక్షించేందుకు ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌లో డబ్బాలు, సిమెంట్ బెంచీలు వేయడంతో ప్రయాణికులకు నిల్వనీడ కరువైంది. ఇటీవల రాత్రికి రాత్రే బస్ షెల్టర్‌లో పాన్‌డబ్బా వేశారు. ఈ డబ్బాలను తొలగించేందుకు ఎవరూ పట్టించుకోకపోవడంతో బస్ షెల్టర్ డబ్బాలకు నిలయంగా మారింది. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు ప్రయాణికులు తలదాచుకునేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్ షెల్టర్‌లో వేసిన డబ్బాను గ్రామపంచాయతీ పోలీస్ శాఖవారు పట్టించుకొని డబ్బాను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పెద్దకొత్తపల్లి బస్‌షెల్టర్‌లో పాన్‌డబ్బా

సులువుగా ఉపాధి పనులు

లింగాల: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు ఉపాధి హామీ పథకం పనులకు కొంత మేలు చేశాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చెరువు, కుంటల్లో ఒండ్రమట్టి తొలగించడం, వ్యవసాయ పొలాల్లో రాళ్లను తీయడం, కుంటలు, చెరువుల కట్టలపై చెట్ల పొదలను తొలగించడం లాంటి పనులు చేపడుతున్నారు. కాగా వేసవి కావడంతో ఎండలకు భూమి గట్టిదనం కావడం, ఎండలకు కూలీలు పని చేసే సమయం కూడా తక్కువగా ఉండడంతో కూలి గిట్టుబాటు అవకపోవడంతో పనులపై కూలీలు అంతగా ఆసక్తి కనబర్చేవారు కాదు. ఇటీవల కురిసిన వర్షాలకు నేల మెత్తగా మారడంతో పనులను సులువుగా చేసుకుంటున్నారు.